ఉచిత ఆరోగ్య కేంద్రం

చందానగర్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ళ లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషంట్‌కు రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్యం అందిస్తారు. వైద్య పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు ఇస్తారు. మైనర్ ఆపరేషన్లు కేంద్రంలోనే చేస్తారు. ఈ ఆరోగ్య కేంద్రానికి సికింద్రాబాద్, మసీద్‌బండ, కొండాపూర్, మార్తాండనగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. ఆదివారం ఆరోగ్య కేంద్రానికి సెలవు.

29న రక్తదాన శిబిరం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీకన్సల్ట్ ఆధ్వర్యంలో జనని బ్లడ్ సెంటర్ సహకారంతో ఈనెల 29వ తేదీ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు శిబిరం ఉంటుంది. 17 ఏళ్ళ నుంచి 60 ఏళ్ళ వయస్సులోపు ఆరోగ్యవంతులైనవారు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని నిర్వాహకులు తెలిపారు.మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 8074649910లో సంప్రదించాలని వారు కోరారు.

ఇఫ్తార్ విందు



గచ్చిబౌలి: కొండాపూర్ శ్రీరాంనగర్ ఏ బ్లాక్‌లో చాంద్‌పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే గాంధీ హాజరయ్యారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

12,13 తేదీలలో 'ఏఐ' ఫ్లాగ్‌షిప్ సమావేశం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, విశ్వం డాట్ ఏఐ, స్వేచ్ఛ డాట్ ఓఆర్‌జీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 12,13 తేదీలలో 'ఏఐ ఫ్లాగ్‌షిప్ రెండవ ఎడిషన్ సమావేశం' నిర్వహించాలని గురువారం నిర్ణయించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పాల్గొంటారు. ఈ సమావేశంలో డెవలపర్లు, ఆర్కిటెక్టులు, స్టార్టప్‌లు, టెక్ లీడర్లు, పాలసీ మేకర్లు పాల్గొనే రెండు రోజుల సదస్సులో ఏఐ సాధనాలు, సాంకేతికతపై వర్క్‌షాప్‌లు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తారు. 25కు పైగా సంస్థలు, దాదాపు 250 జట్లు భాగస్వాములవుతారు.

గ్రాడ్యుయేషన్-డే



మియాపూర్: మియాపూర్ మదీనాగూడ దీప్తి శ్రీనగర్ కాలనీలోని శ్రీనిధి గ్లోబల్ స్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వర్‌రావు, అధ్యక్షులు నల్లపాటి రాజేశ్వరి, డైరెక్టర్ సాయినాథ్ నాయుడులు విద్యార్థులకు పట్టాలను అందజేసి అభినందించారు. పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

తైబజార్ వేలం

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తైబజార్ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మొత్తం 8మంది పాల్గొన్నట్లు కమిషనర్ సాబేర్ అలీ తెలిపారు. గురువారం ఉదయం 11:30 గంటలకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ తైబజార్ వేలం 2025-26 సంవత్సరానికి నిర్వహించగా ఈ వేలంలో అందరి కంటే ఎక్కువగా రూ.45,30,000లకు ప్రశాంత్ కుమార్ దక్కించుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఉగాది.. ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

పటాన్‌చెరు: ఉగాది పర్వదినం పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ హనుమాన్ ఆలయంలో నిర్వహించే పంచాంగ పఠనం ఆహ్వాన పత్రికను గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రతి ఏటా ఉగాది పండగను పురస్కరించుకొని చైతన్యనగర్ హనుమాన్ ఆలయంలో పంచాంగ పఠనం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలందరూ పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ మలేషియా టౌన్‌షిప్ పక్కన వన్ సిటీ అపార్టుమెంట్ రోడ్డులో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ప్రారంభించారు.

ఇక్కడే చదివి.. ఉన్నతులై..

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు వీసీలైన వేళ | ముగ్గురికి అవార్డులు.. ఎంతోమందికి ఫ్యాకల్టీలుగా అవకాశం

రాయదుర్గం: హెచ్‌సీయూ ఘనతను మరింత రెట్టింపు చేస్తున్నారు పూర్వ విద్యార్థులు. ఇటీవల హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు వీసీలుగా ఎంపికయ్యారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పదవులు చేపట్టారు. 50 ఏళ్ళ చరిత్ర కలిగిన హెచ్‌సీయూ పూర్వ విద్యార్థుల్లో కొందరు ప్రజాప్రతినిధులుగా, మరికొందరు మంత్రులుగా ఉన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మరో ఇద్దరు వైస్ చాన్స్‌లర్లుగా ఉన్నారు.



పాండిచ్చేరి వీసీగా సీనియర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు

ఇద్దరికి వీసీలుగా అవకాశం

- డాక్టర్ జీపీ రాజశేఖర్ హెచ్‌సీయూలో 1993-97లో స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్‌గా నియామకమయ్యారు.
- సీనియర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో 1992లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. బయో టెక్నాలజీ విభాగంలో పని చేస్తున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలపై పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా నియమించారు. కాగా ఆయన గత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.



హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని డాక్టర్ సుజితాపంబోలా ఇటీవల అచీవర్స్ అవార్డును అందుకున్న దృశ్యం

అవార్డులు ..

- డాక్టర్ మనోరంజన్ సాహూ ఎంఏ ఎకనామిక్స్ 2010-12 పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ ఎంజే మనోహర్‌రావు యంగ్ ఎకానమిస్ట్ అవార్డును ఇండియన్ ఎకనామెట్రిక్ సొసైటీ ద్వారా అందుకున్నారు.
- డాక్టర్ ఎమ్మాడి నవీన్‌కుమార్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్. ఆత్మనిర్భర్ డిజిటల్ భారత్ సమ్మిట్-2024లో టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డును పొందారు.
- హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని డాక్టర్ సుజితా పంబోలాకు ఇటీవల ప్రతిష్టాత్మకమైన యునెస్కోలోని ప్రోగ్రామింగ్ యూనిట్ విమెన్ ఇన్ సైన్స్ ఫర్ ది డెవలపింగ్ వరల్డ్- నేషనల్ చాప్టర్ ఆఫ్ ఇండియా (ఓడబ్ల్యూఎస్‌డీ-ఎన్‌సీఐ) ద్వారా అచీవర్స్ అవార్డు స్వీకరించారు.

ఇతర పదవుల్లో..

హెచ్‌సీయూలో ఎంఏ పొలిటికల్ సైన్స్ 2005-07 సంవత్సరం పూర్వ విద్యార్థి డాక్టర్ చంద్రశేఖర్ హోటా ఒడిశా సాహిత్య అకాడమీ కార్యదర్శిగా తాజాగా నియమితులయ్యారు. అలాగే ఒడిశా సంగీత నాటక అకాడమీ అదనపు బాధ్యతలను నిర్వహిస్తారు.

- డాక్టర్. సుజిత 2009లో హెచ్‌సీయూ ఎంఎస్సీ బయోటెక్నాలజీలో మెడల్ అందుకున్నారు. పూర్వ విద్యార్థి ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్‌ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా నియామకమయ్యారు.
- శిశురంజన్ పూర్వవిద్యార్థి ఎంఏ ఎకనామిక్స్ 2008-10 విద్యార్థి బార్‌క్లేవ్స్ గ్లోబల్ సర్వీసెస్ ఇండియా మోడల్ రిస్క్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు.ఈ సంస్థ లండన్‌లో ఉంది
- డాక్టర్ సుజిత పొంబాలా ఎంఎస్సీ-2009 ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్(ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా నియమితులయ్యారు.
- పూర్వ విద్యార్థి అసిత్‌రంజన్ మహంతి ఎంఏ-1993, అమరేష్ సమంత్రే ఎంఏ- 1997 పీహెచ్‌డీ 2000, ప్రసాద్‌నాయక్ ఎంఏ-2000 పూర్తి చేయగా వీరు ముగ్గురు ఒడిశా రాష్ట్ర ఆరవ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా నియమితులయ్యారు.



టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డు స్వీకరించిన హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి నవీన్‌కుమార్

ఫ్యాకల్టీలుగా..

- డాక్టర్ శ్రీనివాసరావు స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ 2010-16లో పీహెచ్‌డీ, 2008-10లో ఎంటెక్ పూర్తి చేసి ఐఐటీ రోపర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1గా నియమితులయ్యారు.
- డాక్టర్ .బాపూజీ పూర్వ విద్యార్థి అప్లైడ్ లింగ్విస్టిక్‌లో ఎంఫిల్ 2008-10, పీహెచ్‌డీ 2010-19 పూర్తి చేసిన ఆయన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ) కోల్‌కతాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

శేరిలింగంపల్లి సమస్యలను పరిష్కరించాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: దేశంలోనే పెద్ద అసెంబ్లీ నియోజకవర్గమైన శేరిలింగంపల్లిలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. జాతీయ రహదారికి ఓవైపు రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇటీవల గచ్చిబౌలిలోని పలు అభివృద్ధి పనులకు రూ.1650 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉషా ముళ్లపూడి రోడ్డు విస్తరణ, జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం, నిజాంపేట రోడ్డు, గంగారం హనుమాన్ దేవాలయం నుంచి అపర్ణ అపార్ట్‌మెంట్ వరకు లింకు రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి పెండింగ్ పనులు పూర్తయ్యేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఒక్క సర్కిల్‌లో 550 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేయాల్సి ఉండగా శేరిలింగంపల్లి, చందానగర్, కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో 50 శాతం మంది ఉన్నారని, రిటైర్, చనిపోయిన వారి స్థానంలో నియామకాలు జరగడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. రూ.20 కోట్ల నిధులతో కొత్తగా ఎల్ఈడీ వీధిలైట్లను అమర్చారని, రిపేర్ చేసే విధానం లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జీహెచ్ఎంసీ ఎలక్ట్రిసిటీ విభాగంలో ఎస్ఈ, డీఈ స్థాయి అధికారులే బదిలీపై వస్తున్నారని, ఏఈ స్థాయి అధికారులు లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని వివరించారు. తాను లేవనెత్తిన అంశాలను మంత్రి సీతక్క నోట్ చేసుకుందని పేర్కొన్నారు.

పన్నుల భారం తగ్గించండి

మణికొండ: జీహెచ్ఎంసీ పరిధిలో కన్నా రెండురెట్లు అధిక పన్నును మణికొండ మున్సిపాలిటీ ప్రజలపై మోపుతున్నారని, దానిపై మున్సిపాలిటీలో ఎలాంటి చర్చ లేకుండానే మున్సిపల్ చట్టానికి భిన్నంగా అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆరోపించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మున్సిపల్ పాలకవర్గం తీర్మానం లేకుండానే పన్నుల పెంపును చేపట్టారని సభ్యులే తెలిపారన్నారు. ప్రజలు మున్సిపాలిటీలో అధిక శాతం పన్నులు చెల్లిస్తున్నా తమకు అవసరమైన డ్రైనేజీ, రోడ్లు, ముంపు సమస్య ఎదుర్కోవలసి వస్తుందని వారు వాపోయారన్నారు. లక్ష్మీనగర్‌కాలనీలో వర్షాకాలంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరుతుందన్నారు. నాయకులు కె.ధన్‌రాజ్, జి.నరేందర్, శ్రీకాంత్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, జి.విఠల్, సుమనళిని పాల్గొన్నారు.



లక్ష్మీనగర్ కాలనీలో మాజీ వైస్ చైర్మన్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురు మైనర్ల అరెస్ట్

జువైనల్ హోమ్‌కు తరలించిన పోలీసులు

మియాపూర్: రోడ్డుపై వాకింగ్ చేస్తున్న వ్యక్తి మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ముగ్గురు మైనర్‌లను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 23వ తేదీ చంద్రబాబునాయుడు గెస్ట్ సమీప రోడ్డులో వాకింగ్ చేస్తున్న ఓ వ్యక్తి మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు మైనర్ బాలలు రాత్రి 7.45 గంటల సమయంలో దొంగిలించారు.దీంతో బాధితులు చొప్పరపు రాజ పూర్ణచందర్ రావు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీఎస్, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్దనుండి నాలుగు తులాల గొలుసును స్వాధీనం చేసుకుని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు. జల్సాలకు అలవాటి పడి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. సీఐ క్రాంతికుమార్ పర్యవేక్షణలో డీఐ రమేష్‌నాయుడు బృందం కేసును ఛేదించిన సిబ్బంది ప్రేమ్‌కుమార్, పుల్యానాయక్, చంద్రబోస్, పూర్ణచందర్, సాయిలను అభినందించారు.

గూగుల్ పే చేయించుకుని, ఫోన్‌లు లాక్కుని పరార్

చందానగర్ : మద్యం మత్తులో ఉన్న వ్యక్తి నుంచి వెయ్యి రూపాయలు గూగుల్ పే చేయించుకోవడంతో బాటు రెండు సెల్‌ఫోన్లు లాక్కొని ఆటోడ్రైవర్ పరారైన సంఘటన చోటు చేసుకుంది. చందానగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన ప్రకారం.. చందానగర్‌లోని వినోద్ స్పోర్ట్స్ షాప్ పక్కన నివాసముండే సునీల్ జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి సర్కిల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి మియాపూర్ క్రాస్ రోడ్డులో ఫంక్షన్‌కు హాజరై తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి 1.30 గంటలకు షేరింగ్ ఆటోలో ఎక్కాడు. మద్యం మత్తులో ఉన్న సునీల్‌ను గమనించిన ఆటోడ్రైవర్ చందానగర్‌కు రాగానే ఆటో నిలిపి తనకు రూ.1000లు గూగుల్ పే చేయాలని బెదిరించాడు. ఫోన్ తీసుకోని డబ్బులు పంపించి అతను ఆటో దిగి వెళ్తుండగా ఒక్కసారిగా సునీల్ వద్ద ఉన్న ఐఫోన్, సామ్‌సంగ్ ఫోన్‌లను లాక్కొని ఆటోడ్రైవర్ వెళ్లి పోయాడు. అవాక్కైన బాధితుడు ఇంటికి వెళ్ళిపోయాడు. గురువారం మధ్యాహ్నం చందానగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, డాలర్లతో ఉడాయించిన నిందితుడు రిమాండ్

గచ్చిబౌలి: బంగారం కొనుగోలు, విదేశీ కరెన్సీ ఎక్స్ఛేంజ్ పేరిట అధిక కమీషన్ ఆశ చూపి ఘరానా మోసానికి పాల్పడిన నిందితుడు పుగల్ వాసన్(49)ను గురువారం రిమాండ్‌కు తరలించారు. గత శుక్రవారం గచ్చిబౌలిలో వ్యాపారులు చంద్రశేఖర్ నుంచి 500 గ్రాముల బంగారం, రఫీ నుంచి 18 వేల డాలర్లతో పారిపోయిన నిందితుడిని కోయంబత్తూర్‌లో అక్కడి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక బృందాలు నిందితుడిని వెంటాడుతుండగానే తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. కోయంబత్తూర్ నుంచి పీటీ వారెంట్‌పై తీసుకొచ్చిన గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని 10ఎంఎం అడిషనల్ కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాలతో నిందితుడిని సంగారెడ్డి జైలుకు తరలించారు. కేసు విచారణలో భాగంగా పుగల్ వాసన్‌ను కస్టడీకి ఇవ్వాలని కస్టడీ పిటీషన్ దాఖలు చేశారు. షింగనల్లూర్ కోయంబత్తూర్‌లో నివాసం ఉండే పగుల్‌వాసన్ స్థానికంగా నేత నేస్తుండేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో బంగారం కొనుగోలు, కరెన్సీ ఎక్స్ఛేంజ్ పేరిట మోసాలకు పాల్పడుతున్నాడు.గచ్చిబౌలి పోలీసులు కస్టడీకి తీసుకొని విచారిస్తే ఎక్కడెక్కడ మోసాలకు పాల్పడ్డాడనే విషయాలు వెలుగుచూడనున్నాయి.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 60, బీన్స్ 60, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 15, క్యారెట్ 30, చిక్కుడు 60, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



రాయదుర్గం: గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గురువారం వార్షికోత్సవ వేడుకలు ముగిశాయి. స్వామి వారి పూజ అనంతరం ఆలయంలో కలశ పూజను వైభవంగా నిర్వహించారు. మహాకుంభాభిషేకం, ఆచార్యపూజ చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఆ తర్వాత జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని పురవీధుల్లో స్వామివారి పల్లకిసేవ నిర్వహించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి పడి ఉన్నాడని బుధవారం రాత్రి 10 గంటలకు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి (40-45) అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. చుట్టుపక్కల ఆరా తీయగా వివరాలు లభించలేదు. కొన్ని రోజుల నుండి స్థానికంగా భిక్షాటన చేస్తుండేవాడని స్థానికులు తెలిపారు. ఇతనిని గుర్తిస్తే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

మందుబాబులకు జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమాన, ఆరుగురికి రూ .1500 , మరో ఇద్దరికి రూ. వెయ్యి, మరో వ్యక్తికి జరిమానాతో పాటు రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అదృశ్యమైన చిన్నారి ఆచూకీ లభ్యం

మియాపూర్: అదృశ్యమైన చిన్నారి ఆచూకీ లభ్యమైంది. ఓంకార్ నగర్ బస్తీలో ఈ నెల 21న ఇంటి ముందు ఆడుకుంటున్న మల్లిక(6) అదృశ్యమైన విషయం తెలిసిందే. పోలీసుల దర్యాప్తులో చిన్నారి ఎల్బీనగర్ పోలీస్ సేషన్ పరిధిలో తిరుగుతుండగా అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పోలీసులు మల్లికను అమీర్‌పేట్ బాలల సంరక్షణ కేంద్రం శిశువిహార్‌లో చేర్పించినట్లు తెలిసింది. మల్లికను తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు మియాపూర్ ఎస్ఐ కృష్ణగౌడ్ తెలిపారు.

రైతుబజార్ పనుల్లో వేగం పెంచాలి

భారతినగర్ డివిజన్‌లో పర్యటించిన జోనల్ కమిషనర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి గురువారం పర్యటించారు. బొంబాయి కాలనీలోని రైతు బజారు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పార్కింగ్ వాల్‌కు గ్రిల్స్ ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మార్క్స్ సొసైటీ కాలనీకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం, చైన్‌లింక్ మెష్‌ను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సింధు జోనల్ కమిషనర్‌ను కోరారు. రోడ్ల అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని కోరారు. ఈసందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ సురేష్, వివిధ శాఖల అధికారులు, నాయకులు ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.



భారతినగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

ఎయిర్ పోర్టుకు ఏసీ బస్సులు

మూసాపేట: లింగంపల్లి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు కొత్తగా నాలుగు ఏసీ పుష్పక్ బస్సులు నడుస్తున్నాయని, ప్రతి 50 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని ఆర్టీసీ కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం అపర్ణ కల్యాణి గురువారం తెలిపారు. లింగంపల్లి నుంచి చందానగర్, ఆలివ్న్ క్రాస్ రోడ్డు, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా ఎయిర్‌పోర్టుకు వెళ్తుందని, అదే విధంగా మియాపూర్ నుంచి ఎయిర్‌పోర్టుకు వయా జేఎన్‌టీయూ, శిల్పారామం, హైటెక్ సిటీ, రాయదుర్గం, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి మీదుగా ప్రతి 15 నిమిషాలకు ఒక ఏసీ బస్సు నడిపిస్తున్నామని తెలిపారు. లింగంపల్లి నుంచి ఎయిర్ పోర్టుకు మొదటి బస్సు 5.45 చివరి బస్సు 8.45, మియాపూర్ నుంచి ఎయిర్‌పోర్టుకి మొదటి బస్సు 12.15, చివరి బస్సు 11.45, లింగంపల్లి, ఆల్విన్‌క్రాస్ రోడ్డు, మియాపూర్ జేఎన్‌టీయూ నుంచి ఎయిర్‌పోర్టుకు రూ. 300, శిల్పారామం, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి నుంచి రూ.250 ఛార్జీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మినరల్' ముసుగు..!

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ సర్కిల్‌లో మినరల్ వాటర్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా.. కనీస నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా వ్యాపారులు నీటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

- రాజేంద్రనగర్ సర్కిల్‌లో దాదాపు చిన్నచితకా 30కిపైగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. ఇందులో కనీసం 10 వాటికి కూడా ప్రభుత్వ అనుమతి లేదు. అధికారులు వాటర్ ప్లాంట్‌లపై నిఘా పెట్టక పోవడంతో పూటకో వాటర్ ప్లాంట్ పుట్టుకొస్తోంది.
- ఐఎస్ఐ మార్కు లేకుండా నీటిని విక్రయించేస్తున్నారు. కిరాణా.. జనరల్ స్టోర్స్, మెడికల్ షాపులు, హోటళ్ల వద్ద మినరల్ వాటర్ బబుల్స్‌ను విక్రయిస్తున్నారు. నిర్దిష్ట ధర అనేది లేకుండా రూ.15 మొదలు కొని రూ. 35 వరకు విక్రయిస్తున్నారు.
- రాజేంద్రనగర్‌లో దాదాపు 40కిపైగా వివిధ వాటర్ సప్లయ్ కంపెనీలు ఇంటింటికీ తిరిగి నీటిని అందజేస్తున్నాయి. ఒకే ప్లాంట్ నుంచి నీటిని తీసుకొని వేరు వేరు కంపెనీల పేరుతో నీటిని సరఫరా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- కనీస నాణ్యత, శుభ్రతలపై తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నారు. నీటి వ్యాపారులు అందరూ కలిసి ప్రతి నెల అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందజేస్తున్నందునే వారు ఈ తరహా నీటి వ్యాపారం వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మినరల్ వాటర్ క్యాన్‌లు

- వేసవిలో వ్యాపారులకు నీటి వ్యాపారం మరింత లాభాలను చేకూర్చుతుండటంతో వారి ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది.
- అపార్టుమెంట్లు, కాలనీలకు నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మినరల్ వాటర్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వ్యాపారులు దీనినే అవకాశంగా తీసుకొని అందిన కాడికి దండుకుంటున్నారు. నీటి కొరతతో ఏవో ఒకటి అని ఆ నీటిని తాగుతూ అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

మినరల్ వ్యాపారంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. బోర్ నీటినే మినరల్ వాటర్ పేరిట అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్న ప్లాంట్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా అనుమతులు లేని ప్లాంట్‌లను మూసి వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బోర్ నీటినే...

సర్కిల్ పరిధిలో పలు మినరల్ వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు బోర్ నీటినే బబుల్స్‌లో నింపి విక్రయిస్తున్నారు. ఫిల్టర్ చేసే సమయంలోనే నీటి ట్యాంకుల్లో సగం బోర్ నీటిని నింపి అందులో సగం మినరల్ నీటిని కలుపుతున్నారు.

- రుచి కోసం పౌడర్, లిక్విడ్‌లను కలుపుతున్నట్లు సమాచారం. ప్లాంట్‌లో పెద్ద మొత్తంలో బబూల్స్‌ను కొనుగోలు చేసే వారికి సగం మినరల్ వాటర్, సగం బోర్‌నీటినే అందజేస్తున్నారు. ఏళ్ల తరబడి ఉపయోగించిన నీటి బాటిళ్లను వాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.
- బాటిళ్ల దుర్వాసన వస్తుండటంతో ఇదేమిటని ప్రశ్నిస్తే మినరల్ వాటర్ బాటిళ్లు అలాగే ఉంటాయని ఇష్టం అయితే తీసుకోండంటూ వ్యాపారులు దబాయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.